
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 9 డిసెంబరు 2025



వలస ఓటర్లకు గాలం



- అన్నా బాగున్నారా.. మళ్లీ ఓట్ల పలకరింపులు
- రవాణా ఖర్చులు.. నజరానాలు.. దావతులు
- ప్రతి పంచాయతీలో 40 శాతం ఓట్లు బయటనే..
- మూడో విడత ఉపసంహరణలకు నేడు చివరి గడువు
- నేటితో తొలివిడత ప్రచారానికి తెర



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పల్లె ఓట్లలో ఒక్క ఓటుతో గెలుపు చేజారి పోతుం టుంది. పోటీలో నిలిచిన అభ్యర్థులు ప్రతి ఓటు విలువైనదిగానే భావిస్తారు. ఎన్నో ఏళ్లుగా ఇంటి పక్కనే ఉన్నా పట్టించుకున్న పాపాన పోరు.. ఎన్నికల్లో మాత్రం అన్నా బాగున్నావా అంటూ పలకరింపులు మొదలుపెట్టారు. వరుసలు కలుపుతూ ఆహ్వానాలు పలుకుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు దశల్లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వంలో తుది విడత లెక్క కూడా మంగళవారం తేలిపోనుంది. మూడో విడత ఉపసంహరణల కోసం అభ్యర్థులు బుజ్జగింపులు మొదలుపెట్టారు. మంగళవారం తొలివిడతో ప్రచారానికి తెరపడనుంది. గురువారం పోలింగ్ ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోతుంది. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో ఇప్పటివరకు 27 సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. మొదటి, రెండో విడతలో 153 సర్పంచ్ స్థానాల్లో 574 మంది అభ్యర్థులు, 1,095 వార్డుల్లో 2,673 అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రెండు దశల్లో వార్డుల్లో 411 మంది ఏకగ్రీవమయ్యారు. మూడో విడతలో ఇప్పటికే 11 సర్పంచ్ స్థానాలు, 182 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. సర్పంచ్ స్థానాల్లో 514 మంది, వార్డు స్థానాల్లో 1,834 మంది అభ్యర్థులు ఉన్నారు. మంగళవారం ఉపసంహరణలతో బరిలో ఉండే అభ్యర్థులు తేలిపోనుంది. మొదటి విడత ప్రచారానికి తెరపడి 11న పోలింగ్ ఉండడంతో ఓట్లు సంపాదించుకోవడానికి అభ్యర్థులు అన్ని విధాలుగా ప్రయత్నాలు మొదలుపెట్టారు.

గెలుపోటములకు కీలకంగా వలస ఓట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలోనే దాదాపు 40 శాతం వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, చదువులు, జీవనోపాధి రీత్యా వలస వెళ్లిన వారు ఉన్నారు. గ్రామాల్లో వలస ఓట్లు కీలకం కావడంతో ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని ఓట్లు వేయడానికి రమ్మని మిగతా 8వ పేజీలో..

వామ్మో చలి

- జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 9.2 డిగ్రీలు

సిరిసిల్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో చలి వణికిస్తోంది. సోమవారం జిల్లాలో కనీసం ఉష్ణోగ్రత 9.2 డిగ్రీలు కాగా గరిష్ట ఉష్ణోగ్రత 32.8 డిగ్రీలుగా నమోదైంది. రుద్రంగి మండలంలో అత్యల్పంగా 9.2 కనిష్ట డిగ్రీలు నమోదు కాగా బోయిన పల్లిలో 9.5 డిగ్రీలు, వేములవాడ రూరల్‌లో 10.2 డిగ్రీలు, చందుర్తిలో 10.6 డిగ్రీలు, తంగళ్ళపల్లిలో 11.1 డిగ్రీలు కోనరావుపేటలో 11.4 డిగ్రీలు, ఇల్లంత కుంటలో 11.6 డిగ్రీలు, వేములవాడలో 11.6 డిగ్రీలు. ముస్తాబాద్‌లో 11.7 డిగ్రీలు, సిరిసిల్లలో 11.7 డిగ్రీలు, గంభీరావుపేటలో 11.8 డిగ్రీలు, వీర్నపల్లిలో 11.8 డిగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో 12.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రముఖ వైద్యుడు సత్యనారాయణ స్వామి తల్లి బుచ్చమ్మ(90) సోమవారం మృతి చెందారు. బుచ్చమ్మ మృతదేహానికి నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రముఖ వైద్యుడు సత్యనారాయణస్వామిని పరామర్శించారు. వివిధ పార్టీ నాయకులు

జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న తరుణంలో జిల్లాలో ఎక్కడ ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని ప్యాక్స్ కార్యాలయం ఆవరణలో యూరియా పంపిణీ సోమవారం పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో ఎరువులకు ఎలాంటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించామని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సి అవసరం లేదని అన్నారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు రైతులు మందులను వాడాలని సూచించారు.

ఎన్నికల కంట్రోల్ రూం పరిశీలన

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికుమార్ పరిశీలించారు. కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ తో పాటు సంబందిత ఫిర్యాదుల రిజిస్టర్‌లను పరిశీలించి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూంలో ఫిర్యాదులను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కంట్రోల్ రూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న పరిశీలకులు

పోలీసు సేవలు ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

- ఎస్పీ మహేశ్ బి. గీతే



బాధితుల సమస్యల వింటున్న ఎస్పీ మహేశ్ బి గీతే

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యమని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సిరిసిల్ల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 18 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. అర్జిదారులనుండి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదు దారునికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.

పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత : కలెక్టర్

వేములవాడ రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వట్టెంల గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని , వేములవాడ అర్బన్ మండలపరిషత్ కార్యలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఎన్నికల విధులకు కేటాయించే సిబ్బంది తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం వట్టెంలలోని ప్రభుత్వ పాఠశాలను, దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కల్పిస్తున్న వసతులపై ఆరాతీసారు. కార్యక్రమంలో ఆర్డీవో రాధా బాయి, తహశీల్దార్ విజయ, ప్రకాష్‌రావు, ఎంపీడీవోలు శ్రీనివాస్, కీర్తన తదితదరులు పాల్గొన్నారు.

పోలింగ్ రోజున ప్రభుత్వ సెలవులు

కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ముందు రోజుతోపాటు పోలింగ్ రోజున విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు స్థానిక సెలవులు ప్రకటించినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు.

ఈ నెల 11న మొదటి విడత, 14న రెండవ విడత, 17న మూడవ విడత ఎన్నికల నిర్వహణ ఉన్నందున రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదే శాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ముందు రోజు అలాగే పోలింగ్ రోజు జిల్లాలోని విద్యాసంస్థలు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాల యాలకు స్థానిక సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున సెలవు వర్తిస్తుందని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు.



వట్టెంలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజుకు అండగా నిలుస్తున్న రైతులు



ఇల్లంతకుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మామిడి రాజు

ఇల్లంతకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మామిడి రాజుకు గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు అండగా నిలుస్తున్నారు. ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్‌గా పోటీచేస్తున్న రాజుకు కత్తెర గుర్తు రాగా సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో సన్నకారు రైతుల భూముల నుంచి డి2కెనాల్ తీయడానికి ప్రయత్నించగా రైతులకు అండగా ఉద్యమం చేపట్టి వ్యవసాయ భూములను కాపాడాడు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన ధాన్యం అమ్మకం సమయంలో మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేశాడు. రాజు గెలిస్తే రైతులకు ఇబ్బందులు తొలగిపోతాయని భావించిన రైతులు ప్రచారంలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. వీరిని చూసిన అన్నివర్గాల ప్రజలు రాజు వెంట నడుస్తున్నారు. ప్రజలు ఆశీర్వదించి కత్తెర గుర్తుపై ఓటువేసి సర్పంచ్‌గా గెలిపించాలని రాజు కోరుతుండగా మహిళలు బాసటగా నిలుస్తున్నారు. ఉన్నత విద్యావంతుడైన రాజు గెలువడం ద్వారానే ఇల్లంతకుంట గ్రామం అభివృద్ధి చెందుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆశీస్సులు ఉండటం వల్ల ఆదర్శ గ్రామంగా నిలిచే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

తంగళ్లపల్లి ప్రజల సమస్యలను పరిష్కరిస్తా

● సర్పంచ్ అభ్యర్థి మోర లక్ష్మీరాజం

తంగళ్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. తంగళ్లపల్లిలో బస్టాండ్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్‌గా తనకు అవకాశం ఇస్తే ఏర్పాటు చేస్తానని సర్పంచ్ అభ్యర్థి మోర లక్ష్మీరాజం హామీ ఇస్తున్నారు. సోమవారం తంగళ్లపల్లిలో గడప గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించి రిమోటు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రజలకు సేవా చేయాలనే సంకల్పంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే కర్మకాండ భవనం నిర్మాణంతో పాటు అంతిమ యాత్ర రథం అందిస్తానని హామీ ఇచ్చాడు. అలాగే గత పాలక వర్గంలో వేసిన బోర్లకు మరమ్మతులు చేయించి సోలార్ పవర్ ఏర్పాటు చేసి 24 గంటలు నీరు అందిస్తానని తెలిపాడు. కాగా ప్రజలు మోర లక్ష్మీరాజంను సాదరంగా స్వాగతిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వైద్య శివప్రసాద్, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మోర రాజు, జిల్లా నాయకులు లింగాల భూపతి, నగరపు సత్యనారయణరెడ్డి, సామాల రమేష్, రాపెల్లి ఆనందం, మచ్చ శ్రీనివాస్, సుద్దాల శ్రీనివాస్, సుద్దాల కరుణాకర్, ఎద్మల ప్రతాప్‌రెడ్డి, సామల గణేష్, యూత్ కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి చుక్క శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రిమోటు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మోర లక్ష్మీరాజం

అభ్యర్థులు ఖర్చుల వివరాలను నమోదు చేయాలి

ఇల్లంతకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ఖర్చుల వివరాలను నమోదు చేయాలని మండల ఎన్నికల ఆడిటర్ సిరాజొద్దీన్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అభ్యర్థులకు ఖర్చుల నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రతి ఖర్చును వెంట వెంటనే నమోదు చేయాలన్నారు. ఎన్నికల సంఘం విధించిన పరిమితిలోపు మాత్రమే పోటీచేసే అభ్యర్థులు ఖర్చు చేయాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ ఫారూఖ్, ఎస్సై సిరిసిల్ల అశోక్‌లతో పాటు అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు అవగాహన రేపు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఈ నెల 10న బొప్పాపూర్ లోని రైతు వేదికలో ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎన్నికల అధికారి, ఎంపీడీవో సత్తయ్య సోమవారం పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అభ్యర్థి అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల అధికారి, ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సమర్పించాలి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్లను ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు అదే నెల 12, 13 తేదీల్లో ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో సమర్పించాలని ఎన్నికల అధికారి, ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఫాం-14 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. సిబ్బంది తమ బ్యాలెటును 12,13 తేదీల్లో సమర్పించి ఓటును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి, ఎంపీడీవో సత్తయ్య కోరారు.

బండపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతా

● సర్పంచ్ అభ్యర్థి కట్కం మల్లేశం



బండపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కట్కం మల్లేశం

చందుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గతంలో సర్పంచ్‌గా పనిచేసి అభివృద్ధి చేసి చూపించాను. మళ్లీ గెలిస్తే మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతా అంటూ చందుర్తి మండలం బండపల్లి సర్పంచ్ అభ్యర్థి కట్కం మల్లేశం విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. 2013-18 వరకు బండపల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేసి మళ్లీ ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్నారు. ఉంగరం గుర్తుతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అన్ని వార్డుల్లో ప్రజల మద్దతు కూడగట్టడంతో మల్లేశం విజయం సునాయసమని అంటున్నారు. బండపల్లి సర్పంచ్‌గా రూ.35 లక్షలతో స్కూల్ బిల్డింగ్, రూ. 50 లక్షలతో సిమెంట్ రోడ్లు, స్కూల్‌లో ఆటస్థలం, హెల్త్ సబ్‌సెంటర్, అంగన్‌వాడీ బిల్డింగ్, కుమ్మరి కుంట మత్తడి, దాతల సహకారంతో వెంకటేశ్వర స్వామి ఆలయానికి కల్యాణ వేదిక స్థలం, కుల సంఘాల విరాళాలతో గ్రామ పంచాయతీ స్థలం, ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంక్, మురికి కాలువలు తదితర సౌకర్యాలు కల్పించినట్లు ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బండపల్లి సర్పంచ్ అభ్యర్థి కట్కం మల్లేశం కోరారు.

ముస్కు మల్లారెడ్డి వినూత్న ప్రచారం

చందుర్తి, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముస్కు మల్లారెడ్డి గెలుపు బాటలో దూసుకెళుతున్నారు. బండపల్లి గ్రామంలో గతకొంత కాలంగా మల్లారెడ్డి చేస్తున్న సేవలను ప్రజలు గుర్తించి అండగా నిలుస్తున్నారు. ఫుట్‌బాల్ గుర్తుపై ప్రచారంలో మల్లారెడ్డి ప్రత్యర్థులకు దీటుగా ముందంజలో ఉన్నారు. గెలుపునకు గ్రామంలోని అన్ని కుల సంఘాలు ఏకధాటిగా మద్దతు ఇస్తున్నాయి. మరో వైపు గ్రామంలో వినూత్న హామీలతో ముందుకు వెళ్తున్నారు. గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డు నుంచి వడ్డెరకాలనీ వరకు రోడ్డు మరమ్మతు పనులు చేపడతానని, అంగన్వాడి భవన నిర్మాణంతో పాటు కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, మహిళా సంఘ భవనం తదితర అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. మత్స్యకారులు చేపలు విక్రయించేందుకు చేపల మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామని, ఓపెన్ జిమ్ క్రీడాకారులకు శిక్షణ శిబిరం ఏర్పాటు, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామంలో కోతుల సమస్య పరిష్కారంతో పాటు వృద్ధులు, వితంతులు, వికలాంగుల పెన్షన్ మంజూరుకు, మహిళలకు రూ. 2500 ప్రభుత్వం నుంచి అందేలా కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇండ్ల మంజూరు, గ్రామంలోని పోచమ్మ ఆలయంతో పాటు ఇతర ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహాయ సహకారాలతో గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ముస్కు మల్లారెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు.



బండపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ముస్కు మల్లారెడ్డి

ఇటిక్యాల రాజుకు కుల సంఘాల మద్దతు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఆరెపల్లి సర్పంచ్ అభ్యర్థి ఇటిక్యాల రాజు

వేములవాడ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఇటిక్యాల రాజు గెలుపు బాటలో కొనసాగుతున్నారు. గ్రామంలో రాజు చేస్తున్న సేవలను గుర్తించి ప్రజలు అండగా నిలుస్తున్నారు. ప్రచారంలో రాజు ప్రత్యర్థులకు ధీటుగా ముందంజలో ఉన్నారు. రాజు గెలుపునకు గ్రామంలోని అన్ని కుల సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. మరోవైపు రాజు గ్రామంలో వినూత్న హామీలతో ముందుకు వెళ్తున్నారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి గ్రామాన్ని అభివృద్ధిపరుస్తానని హామీ ఇస్తున్నారు. గ్రామంలో ఆడబిడ్డ పుడితే ఐదేళ్ల పదవీ కాలంలో 10,116రూలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని ఇచ్చిన హామీకి రాజుకు విశేష స్పందన లభిస్తోంది. 2018 నుంచి 2024 వరకు రాజు భార్య నవీన సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి తోడ్పడడంతో విజయం సునాయసం కానుంది. ముంపు గ్రామాల సమస్యల పరిష్కారంలో భాగంగా ముంపునకు గురైన 65 ఇండ్లకు ఒక్కో ఇంటికి 5లక్షల చొప్పున ఇప్పించడం, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు 2లక్షల చొప్పున ఇప్పించడంలో విశేష కృషి చేశారు. గత 5 సంవత్సరాల నుంచి గ్రామంలో ఉచితంగా మినరల్ వాటర్ అందజేస్తున్నారు. ఇతర ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండి అభివృద్ధికి పాటుపడే ఇటిక్యాల రాజు ఉంగరం గుర్తుపై ఓటు వేసేందుకు ప్రజలంతా ప్రతినభూనడంతో రాజు విజయం ఖాయమైంది.

గుండెపోటుతో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మృతి


దేవేందర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రోజు దేవేందర్(53) సోమవారం మధ్యాహ్నం గుండె పోటుతో మృతిచెందారు. దేవేందర్ సోమవారం మధ్యాహ్నం 12గంటల వరకు కరీంనగర్‌లోని గాంధీ చౌరస్తాలో ట్రాఫిక్‌విధులు నిర్వహించారు. విధులు ముగించుకొని ఇంటికిచేరుకున్న వెంటనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 1992లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరిన దేవేందర్, ఆ తర్వాత సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా కన్వర్షన్ పొంది, ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుల్‌గా కరీంనగర్ ట్రాఫిక్‌స్టేషన్‌లో సేవలు అందిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ మృతిపై సానుభూతిని తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ, సీఐలు, ఎస్సైలు పోలీసు ఉన్నతాధికారులు దేవేందర్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధురాలి ఆత్మహత్య


జీల మల్లవ్వ(ఫైల్)

గన్నేరువరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండల కేంద్రానికిచెందిన జీల మల్లవ్వ(85) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సోమవారం గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన జీల మల్లవ్వ కొద్దిరోజులుగా అనారోగ్యసమస్యలతో బాధపడుతోంది. ఆవేదనకు గురయ్యేది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగింది. వ్యవసాయ పనులకు వెళ్లిన కొడుకు ఇంటికి వచ్చేసరికి అపస్మారకస్థితిలో ఉండడాన్ని చూసి అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. అప్పటికే వృద్ధురాలు మృతిచెందింది. కొడుకు జీల ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వృద్ధురాలికి భర్త, కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వీణవంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన బేతోజు అంజనేయులు(27) మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నవంబరు 30న అంజనేయులు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లి గడ్డి మందు తాగాడు. తిరిగి వచ్చి తాను గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే 108లో కరీంనగర్ ఆస్పత్రికి, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. అంజేయులు తల్లి విజయ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చలి మంట కాగుతూ నిప్పంటుకొని వృద్ధురాలు మృతి

మల్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలో సోమవారం చలిమంట కాగుతూ తొంట మల్లవ్వ(85) అనే వృద్ధురాలు మృతిచెందింది. మల్లవ్వ సోమవారం ఉదయం స్నానం చేయడానికి ఇంటివద్ద పొయ్యిమీద నీల్లు వేడి చేసుకుంటూ అక్కడే చలిమంట కాగుతోంది. ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకొని మల్లవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స కోసం మల్లవ్వను జగిత్యాలలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

దాడికి పాల్పడిన మహిళపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలంలోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు దాడిచేసిన సంఘటనలో వీర్నపల్లి మండలకేంద్రానికి చెందిన మహిళ మునిగే భాగ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. గ్రామంలోని యాస యాకుబ్‌కుచెందిన పొలంలోకి భాగ్య ప్రవేశించిందని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన యాకుబ్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేసిందని చెప్పారు. బాధితుడు యాకుబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

మానకొండూర్‌లో 180 మంది బైండోవర్

మానకొండూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్తులు, గత ఎన్నికలలో గొడవలకు పాల్పడ్డ 180 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ సంజీవ్ తెలిపారు. బైండోవర్ చేసిన ఆరునెలలలోపు మళ్లీ గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జేబులు గుల్ల



- వేములవాడలో జోరుగా మూడు బిళ్లల ఆట
- భక్తుల రద్దీ ప్రాంతాలే అడ్డాలు
- పట్టించుకోని అధికారులు

వేములవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం పరిసరప్రాంతాల్లో మూడు బిళ్లల ఆట జోరుగా సాగుతోంది. రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని సంతోషంగా తిరిగి వెళ్లాల్సిన కొందరు భక్తులు జేబులు ఖాళీ చేసుకుని వెళ్తున్నారు. వేములవాడకు వచ్చే భక్తుల వద్ద మూడు బిళ్లల ఆటతో దొరికినకాడికి దండుకుంటున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు పట్టణానికి రావడం నిర్వాహకులకు వరంగా మారింది. అమాయక భక్తులకు గాలం వేసి మోసానికి పాల్పడుతున్నారు. పట్టణంలో భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాలను అడ్డాలుగా మలుచుకుని దందా సాగిస్తున్నారు. జాతర గ్రౌండ్ ఏరియాలో సినిమా థియేటర్ సమీపంలో, గోశాల కట్ట వద్ద, రాజన్న ఆలయ సమీపంలో మూడు ప్రాంతాల్లో భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా మారింది.




గోశాల సమీపంలో కట్టకింద మూడుబిళ్లలాట

● అమాయకపు భక్తులకు గాలం

వేములవాడ పట్టణంలో రద్దీ ప్రాంతాలను గుర్తించి మూడు బిళ్లల ఆటను ఆడేందుకు ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకుంటారు. ఒక్కో చోట ముగ్గురు నుంచి నలుగురు వరకు తమ వ్యక్తులను ఆట ఆడేందుకు ముందుగానే సామాన్య భక్తుల మాదిరి ఆటవద్ద నిలుచుంటారు. భక్తుల దృష్టిని తమవైపు మళ్లించే విధంగా చేస్తారు. రూ. 100 నుంచి ఆట ప్రారంభం అవుతుంది. రూ. 100 పెడితే గెలిస్తే రూ. 200 ఇస్తారు. రూ. 500లకు రూ. 1000 ఇస్తామని నమ్మించి భక్తులను మోసానికి గురిచేస్తారు. మూడు బిళ్లల్లో ఒక బిల్లకు కింది వైపు కలరు వుంటుంది. కలర్ ఉన్న బిళ్లను గుర్తించి ఎంత డబ్బులు పెడితే పెట్టిన వాటికి డబుల్ డబ్బులు ఇస్తామని మభ్యపెడతారు. మూడు బిళ్లలపై భక్తులు, ప్రజలు డబ్బులు పెడితే ఒక బిళ్లపై పెట్టిన వారికి మాత్రమే డబ్బులు వస్తాయి. మిగతా రెండు బిళ్లలపై పెట్టిన డబ్బులు మాత్రం నిర్వాహకులు తీసుకుంటారు. ఇలాంటి మోసం పట్టణంలో కొంత కాలంగా నడుస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టి సారించి ప్రజలు మోసానికి గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

నగదు, మద్యం పట్టివేత


పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీలో పోలీసులు సోమవారం నగదు, మద్యాన్ని పట్టుకున్నారు. సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. మాడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో భాగంగా నగురూర్ నుంచి జూబ్లీనగర్‌వైపు వాహనాల తనిఖీ చేపట్టారు. కొత్తపల్లిమండలం రేకుర్తికి చెందిన వేముల శ్రీకాంత్ వద్ద లక్షరూపాయలను గుర్తించారు. నగదుకు సంబంధించి ఆధారాలు చూపించకపోవడంతో ఎన్నికలరిటర్నింగ్ అధికారి, తహసీల్దార్‌కు స్వాధీనం చేశారు.

● కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీనగర్, నగునూర్, దుర్శేడ్, చెర్లబూత్కూర్‌లో సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా మద్యం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముద్దసాని సూర్యచందర్, మల్లేని సింహాద్రి, బుద్ధం రమేష్, జంగంపల్లి రవిని తనిఖీ చేయగా వారి వద్ద సుమారు 32 లీటర్ల విస్కీ, బీరు బాటిళ్లు లభించినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రుద్రంగిలో మద్యం పట్టివేత

రుద్రంగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ మనోహర్ తెలిపారు. రుద్రంగి గ్రామానికిచెందన ఓవ్యక్తి బైక్‌పై రూ.4వేలవిలువగల మద్యం తరలిస్తుడటంతో రుద్రంగిలోని ప్రధాన రహదారిలో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధికారులు, పోలీసులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ కమ్మరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇష్టా రాజ్యంగా వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు హానీ కలిగించవద్దన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, పట్టుపడితే జరిమానాతో పాటు లైసెన్స్ రద్దు చేసి జైలు శిక్ష పడేలా చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేశారు. ట్రాఫిక్ సీఐలు అనీల్ కుమార్, రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ తో 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుడికి సన్మానం


సైనికుడిని సన్మానిస్తున్న యువకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన యువకుడు బద్దిపడిగె వినయ్ అగ్నివీర్‌గా ఎంపికై మద్రాస్ రెజిమెంట్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి చేరుకున్నారు. ఆయనను స్థానిక యువకులు, గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. యువకులు వినయ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

రూ.2కోట్లకు ఐపీ పెట్టిన వ్యాపారి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): సిరిసిల్ల పట్టణంలో ఓ వ్యాపారి తాజాగా రూ.2కోట్లకు ఐపీ పెట్టడంతో అప్పులు ఇచ్చిన వారితోపాటు సామగ్రి ఇచ్చిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ప్రగతినగర్, శివనగర్ ప్రాంతాల్లో మూడుసంవత్సరాల క్రితం పట్టణానికి చెందిన వ్యాపారి రూ.2 కోట్లతో సూపర్ మార్కెట్‌తోపాటు రైస్ డిపోను ఏర్పాటుచేశారు. అయితే సూపర్ మార్కె ట్‌తోపాటు రైస్‌డిపోలలో నష్టం వాటిల్లడంతో సదురు వ్యాపారి రెండు నెలల నుంచి మార్కెట్‌ను మూసివేశాడు. అప్పులు ఇచ్చిన వారితోపాటు సామగ్రి ఇచ్చిన వ్యాపారులు వారి కుటుంబీకుల వద్దకు వెళ్లగా పదిరోజుల్లో అప్పులు చెల్లించి తిరిగి సూపర్ మార్కెట్‌ను తెరుస్తామని నమ్మించినట్లు తెలిసింది. పది రోజుల గడవక ముందే సదురు వ్యాపారి వ్యాపారంలో నష్టపోయా అప్పులు చెల్లించేస్థితి లేదంటూ అప్పులు ఇచ్చిన వారితోపాటు వ్యాపారులకు సోమవారం ఐపీలు పంపించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడం సంచలనం రేపుతుంది.


కార్మికులతో మాట్లాడుతున్న కౌశిక్ హరి

జీతాలు పెంచి డ్రైవర్లను ఆదుకోండి

పాలకుర్తి,అంతర్గాం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుందనపల్లి హెచ్‌పి ఇంధన డిపోలో ట్యాంకర్ డ్రైవర్,క్లీనర్స్ జీతాలు పెంచి వారిని ఆదుకోవాలని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి అన్నారు.గతంలో వారు తమ సమస్యలను పరిష్కరించాలని హరిని సంప్రదించడంతో ట్యాంకర్ యజమానులతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. లేనియెడల ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటూ వారి హక్కుల సాధనకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ చర్చల్లో మద్దికుంట శంకర్,నిమ్మరాజుల రవి,నెరవట్ల సతీష్, ఎండీ ఇన్నూస్‌తోపాటు పలువురు డ్రైవర్లు,క్లీనర్లు ఉన్నారు.

కిరాణా సామాను పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో హరీష్ అనే వ్యక్తి ఓటర్లకు పంచడానికి సిద్ధంగా ఉంచిన కిరాణా సామాను ప్యాకెట్లను ఎఫ్ఎస్‌టీ అధికారి సురేష్ పట్టుకొని వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. 13ప్యాకెట్ల కిరాణ సామాను విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

వీణవంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీలతో తమకు ఇబ్బంది కలుగుతోందని వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామస్థులు సోమవారం వాటిని అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వందలాది లారీలు గ్రామం నుంచి వెళ్తున్నాయని, రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని మండిపడ్డారు. దుమ్ముధూళితో అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన ఉన్న నివాసాల్లోకి దుమ్ము చేరుతోందని, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని, నీళ్లుచల్లించాలని డిమాండ్‌చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.


రెడ్డిపల్లిలో లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామశివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య తన బైక్‌పై దుమాల బైపాస్ నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. అదే సమయంలో అక్కపల్లి గ్రామానికి చెందిన మహేశ్ తన పికప్ వాహనంలో కూలీలను ఎక్కించుకుని దుమాల వైపునకు వెళ్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్లయ్యను సిరిసిల్లలోని ఆసుపత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాలనీకిచెందిన దామెరసుధాకర్ కుటుంబ సభ్యులు మూడురోజుల క్రితం తిరుపతికి వెళ్లారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు యజమానికి సమాచారం అందించారు. సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు మూడు తులాల బంగారం, రూ.30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

పండ్ల తోటల సాగుతో అధిక ఆదాయం


బొప్పాయి తోట


జామ కాయలను తెంపుతున్న రైతు తిరుపతిరెడ్డి

గొల్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలో ఎనిమిది ఎకరాల్లో పండ్లతోట సాగు చేస్తూ ఓ రైతు అధిక ఆదాయం పొందుతున్నాడు. తిరుపతిరెడ్డి అనే రైతు తనకున్న వ్యవసాయ భూమిలో జామ, బొప్పాయి, మామిడి, కర్బూజ వంటి పండ్ల తోటల పెంపకంతోపాటు పందిరి బీర, కాకర వంటి కూరగాయల సాగు చేస్తున్నాడు. దీంతో ఏటా రూ.8లక్షల మేర ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. తిరుపతి రెడ్డి తన భార్య, తల్లి సహకారంతో పండ్ల తోటలను సాగు చేస్తున్నాడు. పండించిన పండ్ల తోటలవద్ద రోడ్ల పక్కనే విక్రయిస్తున్నాడు. సీజనల్ పండ్ల సాగుకు అధికప్రాధాన్యం ఇస్తున్నాడు. ప్రస్తుతం జామ, బొప్పాయి పండ్లను సాగు చేస్తున్నాడు. వేసవిలో కర్బూజను సాగు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పండ్ల వ్యాపారులు, ఇతర చిరు వ్యాపారులు వీరి దగ్గర కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తుంటారు. తిరుపతిరెడ్డి ఆరు సంవత్సరాలుగా పండ్ల తోటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు.

● పండ్ల తోటల పెంపకం లాభదాయకం..
- తిరుపతిరెడ్డి, రైతు, శ్రీరాములపల్లి



సంప్రదాయ పంటల సాగు కంటే పండ్ల తోటల పెంపకం వల్ల అధిక లాభాలు గడించవచ్చు. ఆరుసంవత్సరాలుగా జామ,బొప్పాయి, మామిడి, కర్బూజ వంటి పండ్ల తోటల సాగు చేస్తున్నా. నా తల్లి, భార్య సహకారం ఎంతో ఉంది. వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన తాజా పండ్లను విక్రయిస్తుంటాం.

రాష్ట్రంలో రూ.3వేల కోట్ల పెట్టుబడి

● గ్లోబల్ సమ్మిట్లో ప్రభుత్వంతో ఎంవోయూ ● పెద్దపల్లి జిల్లాలో గ్రీన్ ఎనర్జీ పరిశ్రమ


ఒప్పందం కుదుర్చుకున్న పత్రాలతో సురభి గ్రూపు ప్రతినిధులు

పెద్దపల్లి, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో పెట్టుబడి పెట్టేం దుకు సురభి గ్రూప్స్ ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో సురభి గ్రూప్ ఎస్ఎల్ఆర్ పవర్ చైర్మన్ సురభి హరేందర్‌రావు రాష్ట్రంలో 3వేలకోట్ల పెట్టుబడితో పెద్దపల్లి జిల్లాలో పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వంతో ఎంఓయు కుదుర్చుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి మల్లు విక్రమార్కకు ఎంవోయు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సురభి గ్రూప్స్ గ్రీన్ ఎనర్జీ సెక్టార్లో భాగంగా పెద్దపల్లి జిల్లా సుగ్లాం పల్లిలో 3వేల కోట్ల రూపాయల పెట్టుబడితో సోలార్‌సెల్, ప్యానెల్ తయారీ పరిశ్రమను నెలకొల్పుతున్నారన్నారు. ఈ పరిశ్రమ నిర్మాణం వల్ల వెయ్యి మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభించనుందన్నారు. ఏడాది కాలంలో పరిశ్రమ నిర్మాణం పూర్తవుతుందని, గ్రీన్‌ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన సురభి గ్రూప్స్ చైర్మన్ హరిందర్‌రావును అభినందించారు.

రెండు ప్రచార ఆటోలు సీజ్

తంగళ్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తున్న తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డం రచన మధుకర్‌కు చెందిన రెండు ప్రచార ఆటోలను తహశీల్దార్ జయంత్ కుమార్ సీజ్ చేశారు. సర్పంచ్ అభ్యర్థి గడ్డం రచన మధుకర్‌కు చెందిన రెండు ప్రచార ఆటోలు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తు న్నాయని తహశీల్దార్‌కు సమాచారం అందింది. తనిఖీ చేసి ఎలాంటి అనుమతి లేదని గుర్తించి రెండు ప్రచార ఆటోలను సీజ్ చేసి కేసు నమో దు చేయించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరు ద్ధంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రచారానికి మైకు, ఆటో పర్మిషన్ తహశీల్దార్ కార్యాలయంలో తీసుకోవాలని సూచించారు.

ఉమ్మెత్త కాయలు తిని ఇద్దరు చిన్నారులకు అస్వస్థత

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో ఉమ్మెత్త కాయలు తిని ఇద్దరు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు ఓరును శ్రీను, స్రవంతి వివరాల ప్రకారం.. వారి కుమారుడు ఆదిత్య, కూతురు మహా గత శనివారం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆవరణలోని ఉమ్మెత్త చెట్టు కాయల గింజలను తిన్నారు. కొద్దిసేపటికి పిల్లలు ఇద్దరూ కడుపు నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు ఇద్దరు చిన్నారులను చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పిల్లలను పరీక్షించిన వైద్యులు ప్రాణపాయం లేదని స్పష్టం చేశారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అందజేత


బాధితుడికి ఫోన్ అందజేస్తున్న జగిత్యాల బస్‌స్టేషన్ మేనేజర్

జగిత్యాల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ మొబైల్ పోగుట్టుకున్న బాధితునికి ఆర్టీసీ అధికారులు తిరిగి అందజేశారు. కొడిమ్యాల మండలం పూడురుకు చెందిన ఆకుల వరప్రసాద్ కోరుట్ల పట్టణంలో విద్యుత్ శాఖలో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

అయితే విధులకు వెళ్లే క్రమంలో అదివారం ఆర్మూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్టాండ్‌లో దిగి చూసుకోగా తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్ కనబడ లేదు. దాంతో వెంటనే బస్సులో తన మొబైల్ పడిపోయిందని ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు బస్సు డ్రైవర్‌కు సమాచారం అందించగా మొబైల్ ఫోన్‌ను బస్సులో నుంచి తీసుకొని అధికారులకు అప్పగించాడు. సోమవారం జగిత్యాల కొత్త బస్టాండ్‌లో బాధితుడు వరప్ర సాద్‌కు స్టేషన్ మేనేజర్ బిఆర్‌రావు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.

భక్తజన సంద్రంగా వేములవాడ

● దర్శనం కోసం భక్తుల పాట్లు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ సోమవారం భక్త జనసంద్రమైంది. ఆలయానికి వివిధప్రాంతాల నుంచి దాదాపు 50వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ స్క్రీన్‌లో రాజరాజేశ్వరస్వామిని, భీమేశ్వరాలయంలో భీమేశ్వరుడిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఇందుకు మూడుగంటల సమయం పట్టింది. భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న అన్నదానసత్రం పైఅంతస్తులో నిత్య కల్యాణం, సత్యనారాయణవ్రతాలు చేయించుకున్న భక్తులకు కష్టాలు తప్పలేదు. నిత్య కల్యాణానికి అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరగడంతో 118 టికెట్లు జారీచేశారు. కేవలం దంపతులను మాత్రమే అనుమతించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షిస్తూ తగిన ఏర్పాట్లు చేపట్టారు. అయినప్పటికీ భక్తుల ఇక్కట్లు చెప్పనలవి కాలేదు. కల్యాణ కట్ట వద్ద స్నానాలకు ఇబ్బందులు పడ్డారు.

వాహనదారులకు ఇబ్బందులు..

ఆలయానికి వచ్చే వాహనాలను భీమేశ్వరాలయం వైపు అనుమతించలేదు. దీంతోవాహనదారులు ఎటువెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. పార్కింగ్, అన్నదానసత్రం వద్ద నోఎంట్రీ బోర్డులు పెట్టారు. దీంతో భక్తులవాహనాలు భీమేశ్వరస్వామి ఆలయానికి చేరుకోవడానికి కిలోమీటర్ దూరంలో వాహనాలు నిలిపి కాలినడకన వెళ్లాల్సి వచ్చింది.

బద్దిపోచమ్మ ఆలయంలో..

బద్దిపోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. భీమేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భం గా పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో బద్దిపోచమ్మఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

అవినీతి జలగలు

● ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు కాని సిటిజన్ చార్ట్
● ఆరేళ్లలో 88 కేసుల్లో 131 మంది లంచగొండి ఉద్యోగులు, సహాయకుల అరెస్టు
● నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం



లంచగొండి ఉద్యోగుల సమాచారం అందించాలంటూ ఏసీబీ ఆవిష్కరించిన పోస్టర్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి కూపంలో మునిగిపోతున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయంకు వెళ్లినా ముడుపులు ముట్టజెప్పనిదే ఏ పని కావడం లేదు. విధి నిర్వహణలో భాగంగా ప్రజల సమస్యలు పరిష్కరిం చడం, పనులను సకాలంలో పూర్తి చేయడం ప్రభుత్వ ఉద్యోగుల విధి. కాని చేయాల్సిన పనులను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారు. లంచం ఇవ్వని వారి ఫైల్ బీరువాలోనే దుమ్ముపట్టి పోతున్నది. అక్కడి నుంచి ఆ ఫైల్ అంగుళం కూడా ముందుకు కదలడం లేదు.

● మధ్యవర్తులుగా సహాయకులు

కొన్ని కార్యాలయాల్లో ఆ ప్రభుత్వ కార్యాలయాకు అనుబంధంగా పనిచేస్తున్న ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు, వాహనాల డ్రైవర్లు, ప్రైవేట్ సహాయకులు మధ్యదళారులుగా వ్యవహరిస్తూ లంచాలను ప్రజల నుంచి వసూలు చేసి అధికారులకు అందజేస్తున్నారు. ఇలా కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రైవేట్ ఏజెంట్లు, డ్రైవర్లను ఏర్పాటు చేసుకుని లంచాలను వారి ద్వారానే స్వీకరిస్తూ ఏసీబీకి దొరకకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకపని పూర్తి చేయటానికి ప్రభుత్వం నిర్దిష్టమైన కాలాన్ని నిర్ణయించింది. దీనినే సిటిజన్ చార్ట్ అంటారు. ఏ కార్యాలయంలోనూ సిటిజన్ చార్ట్ బోర్డు కనపడదు. ఒకవేళ ఏమూలో కనపడకుండా ఏర్పాటు చేసిసిన బోర్డులో ఆయా పనులు పూర్తి చేసే కాలపరిమితిని పేర్కొన్నప్పటికీ అది అములకు నోచుకోదు.

● టోల్ ఫ్రీ నంబర్ 1064, క్యూఆర్ కోడ్ స్కాన్‌తో ఫిర్యాదులు

అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సమాచారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు కాల్ చేసి చెప్పవచ్చని, తప్పకుండా చర్యలుంటాయని ఏసీబీ పోలీసు అధికారులు అంటున్నారు. ఏసీబీ వాట్సప్ నంబరు 9440446106, కరీంనగర్ డీఎస్పీ నంబర్ 9154388954, క్యూఆర్ కోడ్‌కు స్కాన్ చేసి తెలంగాణ ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. సమాచారం అందించినవారు పేర్లను గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.

● అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ నేపథ్యం...

చాలాదేశాల్లో అవినీతి పెరిగిపోయిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి 2003 డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించాలని తీర్మానించింది. ఈ మేరకు ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 9న అవినీతి వ్యతిరేక దినోత్సవంపై సమావేశాలు, ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహిస్తున్నారు. కరీంనగర్ లో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి 9వతేదీ వరకు అవినీతి వ్యతిరేక దినోత్సవంపై పలు కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.

● కరీంనగర్ రీజియన్‌లో 2019 నుంచి ఇప్పటి 2025 వరకు లంచాలు తీసుకున్న సంఘటనల్లో ఏసీబీ పోలీసులు 88 కేసులు నమోదు చేసి 131 మంది లంచగొండి ఉద్యోగులు, మధ్యవర్తులను అరెస్టు చేశారు. ఇందులో 35 మంది రెవెన్యూ ఉద్యోగులు, 13మంది పోలీసు ఉండటం గమనార్హం. 2019లో 17 కేసుల్లో 25 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఏసీబీ పోలీసులు అరెస్టుచేసి కటకటాల్లోకి పంపించారు. 2020లో ఏడు కేసుల్లో 11మంది, 2021లో 9 కేసుల్లో 15 మంది, 2022లో 13 కేసుల్లో 17 మంది, 2023లో ఎనిమిది కేసుల్లో 11 మంది, 2024లో 11 కేసుల్లో 17 మంది, 2025లో (డిసెంబరు 8 వరకు) 23 కేసుల్లో 35 మంది ప్రభుత్వ ఉద్యోగులు, మధ్య దళారులతో లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు.

నిజాయితీ చాటుకున్న అంబులెన్స్ పైలట్

● వాహనంలో మరిచిపోయిన రూ.10వేలు అప్పగింత



నగదును అప్పగిస్తున్న పంజాల సురేష్

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రానికి చెందిన 102 వాహనం పైలట్ పంజాల సురేష్ మరచిపోయిన రూ.10,000 బ్యాగ్ అప్పగించి సోమవారం నిజాయితీ చాటుకున్నాడు.. ధర్మపురి మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుగ్గారం గ్రామానికిచెందిన పొన్నం సుకన్య ఐదు రోజుల క్రితం డెలివరీ అయ్యింది. ధర్మపురి సీహెచ్ నుంచి బుగ్గారం గ్రామానికి చెందిన సుకన్యను 102వాహనంలో ఇంటికి తీసుకు వెళ్లాడు. ఆ సమయంలో పేషంట్‌తో పాటు సామాన్లు దించి పైలట్ సురేష్ ధర్మపురికి చేరుకున్నాడు. వాహనం లోని క్యాబిన్‌లో చూసే సరికి రూ.10వేల నగదు ఉన్న బ్యాగ్ కనిపించడంతో వెంటనే సుకన్య తండ్రి పొన్నం సత్తయ్యకు ఫోన్ చేశాడు. సత్తయ్య ధర్మపురి చేరుకోగా రూ.10వేల నగదుఉన్న బ్యాగ్‌ను ఆయనకు అప్పగించాడు. ఈసందర్భంగా పైలట్ సురేష్‌ను పలువురు అభినందించారు.

ఆర్టీసీ డిపో ఎదుట టిమ్స్ డ్రైవర్ల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న టిమ్స్ డ్రైవర్లు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పని భారాన్ని పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట టిమ్స్ సర్వీస్ డ్రైవర్లు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా డ్రైవర్ రంగయ్య మాట్లాడుతూ తమకు ఎలాంటి సమాచారం లేకుండా సోమవారం నుంచి రెండు రోజుల పనివిధానాన్ని ఒక రోజుకు తగ్గించారని అన్నారు. హైదరాబాద్ ఉదయం వెళ్లే టిమ్ డ్రైవర్‌కు రెండు రోజుల వేతనాన్ని ఒకేరోజుకు తగ్గించారన్నారు. దీంతో కండక్టర్, డ్రైవర్ రెండు విధులు ఒకరే నిర్వహించాలంటే ఇబ్బందిగా మారుతుందన్నారు. ఈ సర్వీసులకు కండక్టర్‌ను కూడా ఇస్తే తాము విధులు నిర్వహించడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తాము సంస్థకోసం పనిచేస్తామని, సంస్థను కాపాడుకోవడానికి కష్టపడుతామన్నారు. 20ఏళ్లుగా టిమ్స్ డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు స్పెషల్ఆఫ్ ఎత్తివేయడంతో తీవ్ర ఆర్థికనష్టం ఏర్పడుతుందన్నారు. రెండు విధులు ఒకరే నిర్వహించాలంటే ఆరోగ్యం సహకరించడం లేదన్నారు. అధికారులు కొత్తగా తీసుకువచ్చిన నిబంధనను రద్దుచేసి పాత పద్ధతిలోనే విధులు కేటాయించాలని డ్రైవర్లు డిమాండ్ చేశారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష వాయిదా వేయాలి



యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీజీ మూడో సెమిస్టర్ పరీక్షను వాయిదా వేయాలని శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల జరుగుతుంటే వీసీ ఇదే సమయంలో పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు చాలామంది ఉన్నారని, ఓటు కోసం వెళ్లిరావాలంటే చాలాసమయం పడుతుందని అన్నారు. ఆలోచించకుండా పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. డిసెంబరులోనే సెట్, నెట్ ఎగ్జామ్స్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని, యూనివర్సిటీలో చాలామంది విద్యార్థులు ప్రిపేర్ అవుతున్నారని అన్నారు. పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా యూనివర్సిటీలోని లైబ్రరీకి టైమింగ్స్ పెట్టి విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని, ప్రశ్నించిన విద్యార్థులను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. వీసీ చొరవ తీసుకొని విద్యార్థుల సమస్య లను పరిష్కరించాలన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



మానేరువాగులో అయ్యప్పస్వామికి చక్రస్నానం చేయిస్తున్న గురుస్వామి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని మాలధారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన అయ్యప్పస్వామి శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన శోభయాత్ర మంగళవాయిద్యాలతో అయ్యప్పదీక్షాపరుల నృత్యాలు, శరణుఘోషతో సిరిసిల్ల పట్టణం మారుమోగింది. అనంతరం మాండవ్యనదిలో గురుస్వామి రాచవిద్యాసాగర్ సారథ్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలతోపాటు చక్రసాన్నం నిర్వహించారు. అనంతరం సాయినగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మెట్లపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు దుబ్బ విశ్వనాథం, ఎరుకల ప్రకాష్, బల్కి రమేష్ పంతులు, మాజీ కౌన్సిలర్లు కల్లూరి రాజు, వెల్దండి దేవదాస్, అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, కూన సురేష్, మచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గజ.. గజ..

● చలి నుంచి రక్షణకు ఒక్కచోట ఒదిగిన పిట్టలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న చలితీవ్రతతో చిన్నచిన్న పక్షులు తట్టుకోలేక పోతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం విద్యానగర్‌లో సోమవారం తెల్లవారుజామున కురుస్తున్న మంచుకు పక్షులు తడిసి ముద్దయ్యాయి. చలి దాటికి ఏడు చిన్న పసరిక పిట్ట(దీ గ్రీన్ బీ)లు సూర్యకాంతి కోసం వేచి చూస్తూ విద్యుత్ తీగపై దారంకు గుచ్చిన పూలమాదిరిగా ఒక్కచోట దగ్గరగా కూర్చుని వెచ్చదనం పొందుతున్నాయి. ఈ దృశ్యంను 'ఆంధ్రజ్యోతి' తన కెమరాలో బంధించింది.



విద్యుత్ తీగపై చలిలో పసరిక పిట్టలు

బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మ ఆలయం రాజగోపురాల నిర్మాణాలకు సోమవారం దేవాదాయశాఖ స్థపతి వల్లి నాయగం, ఎస్ఈ దుర్గాప్రసాద్ మార్కింగ్ చేశారు. అనంతరం ఆలయ రాజగోపుర నిర్మాణాలకు సంబంధించిన మార్కింగ్, నిర్మాణ పద్ధతులు, విస్తీర్ణం, శిల్పకళా ప్రమాణాలను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ జోన్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో సత్తాచాటి వెస్ట్ జోన్ పోటీలకు సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. ఈ నెల 6, 7 తేదిలలో రంగారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మిత ఉమెన్స్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరగాయి. వెస్ట్ జోన్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ప్రవళిక, శ్వేదికలను సోమవారం తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ కోశాధికారి పన్నీర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ నుండి ముగ్గురు బాలికలు కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొన్నారు. జూనియర్ హార్డ్ స్టైల్‌వెపన్ ఈవెంట్ విభాగంలో గంగనావేణి ప్రవళిక గోల్డ్‌మెడల్, సబ్ జూనియర్స్ విభాగంలో గజ్జెల శ్వేదిక సిల్వర్ మెడల్ సాధించింది. గోల్డ్,సిల్వర్ మెడల్స్ సాధించిన ప్రవళిక, శ్వేదిక వెస్ట్‌జోన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెస్ట్ జోన్‌స్థాయి పోటీలలో ఎనిమిది రాష్ట్రాలు పోటీలలో పాల్గొంటాయి. ఈనెల 25 నుంచి 28 వరకు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరగనున్న వెస్ట్‌జోన్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రవళిక, శ్వేదికలు పాల్గొంటారు.



రాష్ట్ర స్థాయి పోటీలలో మెడల్స్ సాధించిన బాలికలు

అహల్యానగర్‌లో ఇళ్ల చుట్టూ మురుగు నీరు

హుజూరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అహల్యానగర్-1లో ఇళ్ల చుట్టూ మురుగునీరు నిలుస్తుండడం స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తోంది. కొన్నిరోజులుగా మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాలనీలో చేపట్టిన మురికి కాలువ నిర్మాణం సగంలోనే వదిలేశారని, ఇళ్లలోని మురుగునీరు రోడ్లమీద నిలుస్తోందని వాపోతున్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించాలని, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇళ్ల చుట్టూ ఉన్న మురుగునీరు

రూ.7300 పలికిన పత్తి ధర


జమ్మికుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7300పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 68మంది రైతులు 546 క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంద్వారా గరిష్ఠధర రూ.7300, కనిష్ఠధర రూ.6500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ కమిటీచైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం పరిశీలించారు.



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

ఖని జనరల్ ఆసుపత్రిలో పని చేయని నిఘా నేత్రాలు

● పెరుగుతున్న చోరీలు
● ఏడాదిగా నిరుపయోగంగా ఉన్నవైనం



ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం రోగులతో కిటకిటలాడే గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో ఏడాదిగా సీసీ కెమెరాలు పనిచేయక ఆసుపత్రికి వచ్చే రోగుల విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. ఆసుపత్రి పాత భవనం చుట్టూ, లోపల 13నిఘా నేత్రాలు ఉండగా అవి పని చేయడం లేదు. ఇటీవల ఆసుపత్రిలో రోగుల వస్తువులు, సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు డబ్బులు పోగొట్టుకుని ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆసుపత్రికి వచ్చే బాధితుల్లో చాలా మంది నిరుపేదలు కావడం, వారు తెచ్చుకున్న వస్తువులు దొంగలు ఎత్తుకెళుతుండడంతో మనోవేదనకు గురవు తున్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆసుపత్రిలో 13 కెమెరాలు, మెడికల్ కళాశాలలో 12 కెమెరాలను ఏర్పాటు చేశారు. రెండేళ్ల పాటు పని చేసిన ఈ సీసీ కెమెరాలు ఏడాదిగా పనిచేయడం లేదు. సీసీ కెమెరాల కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి కావడంతో వాటిని పట్టిం చుకోవడం లేదు. ఆసుపత్రిలో ఓపీవార్డుల వద్ద కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ కేబుల్ వైర్లు తెగిపోయాయి.

● ఆసుపత్రిలో విలువైన యంత్రాలు చోరీ...

రోగుల వస్తువులతోపాటు ఆసుపత్రిలోని విలువైన యంత్రాలు చోరీకి గురవుతున్నాయి. ఇటీవల వైద్యులు హాజరు నమోదు చేసుకునే ఫేస్ రికగ్నైజ్ యంత్రాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై ఇప్పటికీ వారిని కనిపెట్టలేకపోయారు. నిత్యం సెక్యూరిటీ కనుసైగల్లో ఉండే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విలువైన ఫేక్ రికగ్నైజ్ యంత్రాన్ని చోరీ చేయడం పలు అనుమానాలకు దారి తీస్తుండగా పోలీసులు విచారణ చేపట్టినా జాడ తెలియలేదు. చోరీకి గురైన యంత్రానికి సెక్యూరిటీ గార్డులను బాధ్యులను చేస్తూ వారి వేతనాల నుంచి కోత విధించారు. దీనిపై సెక్యూరిటీ గార్డులు కూడా నిరసన తెలిపారు.

● రోగుల వస్తువులు, బైక్‌ల చోరీ

ఆసుపత్రికి వచ్చే రోగుల విలువైన వస్తువులు, బైక్‌లను చోరీచేస్తున్నా వారిని పట్టుకోలేక పోతున్నారు. బెల్లంపల్లికి చెందిన ఓ వ్యక్తి భార్య ప్రసవం కోసం ఆసుపత్రికి రాగా అతడు వరండాలో నిద్రిస్తుండగా జేబులో నుంచి పర్సును ఎత్తుకెళ్లారు. గోదావరిఖనికి చెందిన ఓ వ్యక్తి డబ్బులు చోరీ చేశారు. ఇటీవల రెండు బైక్‌లు కూడా చోరీకి గురికాగా ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ, వైద్య సిబ్బంది పట్టుకున్నారు.

కలెక్టర్‌కు విన్నవించాం...

\- రాజు, ఆర్ఎంవో



ఆసుపత్రిలో ఏడాదిగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మెడికల్ కళాశాల నిర్మాణంలో భాగంగా ఆసుపత్రిలో 13, కళాశాలలో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో 13కెమెరాలు పని చేయడం లేదు. చోరీలపై రోగులు తరచూ ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

ఏకగ్రీవ సర్పంచ్‌లను అభినందించిన ఎమ్మెల్యే



ఏకగ్రీవమైన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో ఏకగ్రీవం అయిన సర్పంచ్, వార్డుసభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. మానకొండూర్ నియోజకవర్గ కేంద్ర కార్యాలయం సోమవారం ఏకగ్రీవం అయిన వారు ఎమ్మెల్యేను కలిశారు. మండలంలో 8 సర్పంచ్ స్థానాలతో పాటు వార్డుసభ్యులను ఏకగ్రీవం చేసిన ప్రజలు అభినందనీయులు అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టుతున్నారని పేర్కొన్నారు. ఏకగ్రీవ గ్రామపంచాయతీల అభివృద్ధికి అదనపు నిధులు కేటాయిస్తానని పేర్కొన్నారు. ఈ నెల 14న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ మద్దతుతో పోటీచేస్తున్న వారిని గెలిపించాలని, నాయకులు అందుకు కృషి చేయాలని సూచించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, గుడిసె అయిలయ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ ప్రసాద్, నాయకులు బొల్లవేని రమేష్, భాస్కర్‌రావు, రమేష్, శ్రీనివాస్, తిరుపతి, రాజేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కిష్టయ్య, నరేందర్‌రెడ్డి, రవి, రమేష్, దేవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కనుకయ్య, శ్రీహరిలతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఇల్లంతకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అబాకస్ పోటీలలో మండలకేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కరీంనగర్‌లో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్ పోటీలలో మంద మేగాన్స్, నంది రిశ్విత, తీగల శాన్విక, మామిడి అరవింద్‌లు విజేతలుగా నిలిచారు. గాజుల మహేష్‌బాబు, దూది అద్విత్‌రెడ్డి, లింగంపల్లి దేవాన్ష్, అనరాసి సురేఖ, వజ్జపల్లి యాగ్నిక, గూడెల్లి ఆరుశ్, ఈదుల చిద్విలాసిని, ఎలుక సహస్ర, గడ్డమీది శ్రీవైజ్ఞిక, సిరికొండ రిత్విక్, బిల్లవేని దీక్షిత్, బొమ్మకంటి రక్షిత్‌రెడ్డి, కుక్కల హిమశ్రీలు ప్రతిభకనబర్చారు. పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, అబాకస్ ఉపాధ్యాయులు రాజు, రమేష్, రాజు, సుమంగళిలతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థికి సన్మానం

ఇల్లంతకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన రామంచ సుశాంత్‌ను మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ సత్కరించారు. గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నిరుపేద కుటుంబంలో పుట్టిన సుశాంత్ అండర్ 14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ప్రోత్సాహకంగా రూ 5వేలు అందించి, భవిష్యత్తులో అండగా ఉంటానని భరోసా ఇచ్చాడు. కార్యక్రమంలో నాయకులు మీసరగండ్ల అనీల్‌కుమార్, కేతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాతిరెడ్డి జనార్దన్‌రెడ్డి, గొల్లపల్లి మల్లేశం, కరికె విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలను నమోదు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రచారంలో భాగంగా చేసే ఖర్చు వివరాలను నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్ సూచించారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంతో పాటు వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆయన వెంట నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీవో సత్తయ్య ఉన్నారు.

కరాటేతో బాలికలకు ఆత్మరక్షణ



కరాటేలో పతకాలు సాధించిన కనగర్తి విద్యార్థులకు సన్మానం

కోనరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు కరాటేతో ఆత్మరక్షణ అలవడుతుందని కనగర్తి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వినోద్ అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆదివారం వేములవాడలో వీర కరాటే కింగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీల్లో శరణ్య, వైష్ణవి, నక్షత్ర, రచనలు బంగారు పతకాలు సాధించగా వారిని అభినందించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని అన్నారు. కరాటేతో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే కాకుండా తెగింపు వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కరాటే కోచ్ ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు కనకయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్కై స్కూల్ విద్యార్థికి బంగారు పతకం

వేములవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని స్కైస్కూల్‌కు చెందిన విద్యార్థి అఖిల్‌కు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ ఆసరి మహేష్ తెలిపారు. వేములవాడ పట్టణంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారం పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కరస్పాండెంట్ మహేష్, ప్రిన్సిపాల్ జమున, ఉపాధ్యాయలు అర్చన, సూపర్‌వైజర్ రాము తదితరులు అభినందించారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

- మండల వ్యవసాయాధికారి సాయి కిరణ్

వేములవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పకుండా వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని, దానితో అధిక దిగుబడులు రాణించవచ్చని మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ సూచించారు. వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లిలో భాస్వరం కరిగించే బాక్టీరియా పైడర్ వాడడంపై క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా భాస్వరం కరిగించే బాక్టీరియా పౌడర్ వాడడం గురించి, పశువుల ఎరువుతో కలిపి వాడు విధానం గురించి రైతులకు వివరించినట్లు తెలిపారు. 100 కిలోల పశువుల ఎరువులో 20 కిలోల బ్యాక్టీరియా ఎరువుతో కలిపి మొత్తాన్ని మూడు రోజుల పాటు మాగబెట్టాలని, తరువాత వరి పొలం, మక్కజొన్న, పప్పుధాన్యాల పండించే నేలలో వాడుకోవాలని సూచించారు. దీనివల్ల భూమిలో వున్న అచేతన స్థితిలోని భాస్వరం మొక్కకు త్వరితగతిన అందుబాటులోకి రానున్నాదని పేర్కొన్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతులు స్వామిరెడ్డి, రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి



గంభీరావుపేటలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి



జోగాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై రమేష్

గంభీరావుపేట, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారీ పేర్కొన్నారు. గ్రామ పంచాయితీ ఎన్నికల నే పధ్యలో గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు, ఈ సంధర్భంగా డీఎస్పీ నాగేంద్రచారీ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా శాంతియుతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. డబ్బు, మద్యం ద్వార ఓటర్లను ప్రబావితం చేసే ప్రయత్నాలు చేస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికలు ప్రశాంతమై వాతావరణంలో జరుపుకోవాలని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన హక్కు అని, దాన్ని నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐలు అనిల్‌కుమార్, రాహుల్‌రెడ్డి ఉన్నారు.

● ఈ సందర్బంగా డీఎస్పీ నాగేంద్రచారికి విద్యార్థులు పోటీ పడుతూ షేక్‌హ్యాండ్ ఇచ్చారు. డీఎస్పీ నాగేంద్రచారి ఎంతో ఆప్యాయంగా విద్యార్థులకు షేక్‌హ్యాండ్ ఇస్తూ ఎలా ఉన్నారు. బాగా చదువుతున్నారా.. అంటూ వారితో ముచ్చటించారు.

చందుర్తి: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై రమేష్ అన్నారు. చందుర్తి మండలంలోని జోగాపూర్ గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నియమావళిపై సోమవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో నియమావళిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఓటరు నియమావళిని తప్పక పాటించాలని సూచించారు. నిబంధనలు, ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలను స్పష్టం చేశారు. ఎన్నికల పేరుతో గ్రామాల్లో వర్గాలు లేదా విబేదాలు సృష్టించడం పూర్తిగా చట్ట విరుద్ధమన్నారు. సామరస్య వాతావరణాన్ని కాపాడాలన్నారు. ఓటర్లు మద్యం, నగదు, ఉచితాల పంపిణీ లాంటి ప్రలోభాలకు లోనుకావద్దన్నారు. మద్యం పంపిణీకి పాల్పడే వారిపై, ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో సోమవారం పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా కొనసాగారు. ఆ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని భద్రత చర్యలు చేపట్టామని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిఘా తీవ్రతరం చేశామని అన్నారు. డబ్బులు, ఇతర తాయిలాలు ఇస్తామంటూ మభ్యపెడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట ఎస్‌ఐలు రాహుల్‌రెడ్డి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వేములవాడ రూరల్ : సర్పంచ్ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలుంటాయని రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు వట్టెంల గ్రామంలో జిల్లా పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలలో పటిష్ట భద్రత ఏర్పాటు చేసామన్నారు. ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. రూరల్ ఎస్సై వెంకట్రాజం మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. బోయినపల్లి ఎస్సై రమాకాంత్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట : ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పట్ల సమస్యలు తలెత్తితే సమాచారం అందించాలని కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి కోరారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో సోమవారం ఎన్నికలపై గ్రామస్తులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు పోవద్దని శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించి తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వలస ఓటర్లకు గాలం

(5వ పేజీ తరువాయి)

ఆహ్వానిస్తున్నారు. ఒకరోజు ముందే సొంత ఊర్లకు వచ్చే విధంగా వలస ఓటర్లకు ఏర్పాట్లు చేశారు. వారిని రప్పించడానికి ప్రత్యేకంగా బృందాలను అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్నారు. ఓటు వేసి తిరిగి వెళ్లే వరకు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసే విధంగా బృందాలకు బాధ్యతలు అప్పగించారు. వచ్చే వారికి రవాణా ఖర్చులతో పాటు కానుకలు, దావతులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా నుంచి విద్యార్థులు కూడా ఎక్కువ సంఖ్యలోనే మెడికల్, ఇంజనీరింగ్, ఎంబీఏ ఇతర చదువులు నిమిత్తం హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో ఉన్నవారిని తీసుకువచ్చే విధంగా వాహనాలు సిద్ధం చేస్తున్నారు. ఉద్యోగాల్లో బెంగళూర్, ముంబాయి, పూణే, చెన్నై వంటి నగరాల్లో ఉన్నవారికి గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా ముందుగానే రవాణా ఖర్చులు పంపిస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు గ్రామంలో ఉన్న వారి కుటుంబ సభ్యులతో మాట్లాడిస్తూ వారిని తప్పకుండా ఓటు వేయడానికి వచ్చే విధంగా కష్టపడుతున్నారు. జిల్లాలో తుది ఘట్టం అభ్యర్థుల లెక్క తేలిపో నుంది.

మూడో విడతలో...

మూడో విడతలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాలకు ఎన్నికలు నిర్వహించడానికి నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. 87 సర్పంచ్,762 వార్డులకు నామినేషన్లు స్వీకరించారు. 514 మంది సర్పంచ్ స్థానాలకు, 1834 మంది వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వేశారు. మంగళవారం నామినేషన్లు ఉపసంహరణల కోసం ప్రత్యర్థి అభ్యర్థులను తప్పించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఏకగ్రీవాల కోసం అభ్యర్థులు రూ. 40 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు. మరోవైపు ఒకే పార్టీ నుంచి ఇద్దరు ముగ్గురు నామినేషన్లు వేసిన వారిని బుజ్జగిస్తూ పోటీ నుంచి తప్పుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రభుత్వ వైద్య సేవలు విస్తృతంగా అందించాలి

● ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు ● జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు విస్తృతంగా అందించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గర్భిణీల ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీల్లో పోషక లోపాలను, అనీమియా నివారణ తొలగించే దిశగా ఐరన్ మందులు, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ, ప్రసవాలు అధికంగా జరిగే విధంగా వైద్య సిబ్బంది ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తెలిపారు. ఇమ్యునైజేషన్ ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని, వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే చికిత్స అందించి నయం చేయవచ్చని, టీబీ విస్మరిస్తే మరొకరికి సోకే ప్రమాదం ఉందని , టీబీ లక్షణాలు గల వారిని గుర్తించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేసి అవసరమైన వారికి చికిత్స అందించాలని, క్యాన్సర్ పరీక్షలు చేసి తదుపరి చికిత్స అందించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య అధికారి రజిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ రవీందర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

భారీగా జన సమీకరణ

ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో అభ్యర్థులు

చందుర్తి,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. తమ బలాన్ని నిరూపించుకునే పనిలో అభ్యర్థులున్నారు. చందుర్తి మండలంలోని 19 పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటీ బలనిరూపణలకు సిద్ధమయ్యారు. ఓటర్లకు తాయిలాలు ప్రకటిస్తూ మందు, విందు, వినోదాలతో పాటు రోజువారీ కూలి డబ్బులు ఇస్తూ గ్రామంలో ఓట్లను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఓ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థుల కంటే ఎక్కువగా వార్డు అభ్యర్థులు ఇంటింటికి చికెన్, మటన్, పంపిణీ చేపట్టారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికే చందుర్తి మండలంలోని ఓ గ్రామంలో ఓ అభ్యర్థి నామినేషన్ రోజు వందలాది మందితో ర్యాలీగా తరలివచ్చారు.

ముంపు గ్రామాల సమస్యలపై పోరు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

వేములవాడ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముంపు గ్రామాల సమస్యలపై కొట్లాడిన వారిపై కేసులు పెట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అన్నారు. సోమవారం రాత్రి వేములవాడ మండలం సంకెపల్లిలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ తెలంగాణ ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ పోరాటం

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్

వేములవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని, కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ అన్నారు. వేములవాడ పట్టణంలోని సభాష్‌నగర్ 169వ బూతులో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ కేంద్రంలో ఎన్నో యేళ్లుగా ఓట్లు చోరీ జరుగుతున్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలకు బీజేపి పార్టీపై వ్యతిరేకం ఉన్నప్పటికీ బీజేకీ అధికారంలోకి రావడం పలు అనుమానాలకు తావిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీపై ప్రజలకు పూర్తిగా నమ్మకం కలిగిందని, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో పట్టణంలో ఓట్ చోర్‌పై ప్రచారం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్

ముస్తాబాద్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ , కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె మహేందర్‌రెడ్డి మట్లాడుతూ పల్లెల అభివృద్ధి అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమవుతుందని సూచించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి చేసి లక్షల్లో అప్పులు చేసి పెట్టిందన్నారు. బంధుబలగాలు తప్ప తెలంగాణ ప్రజలకు ఒరింగేదేమీ లేదన్నారు. కమిషన్ కాకతీయ, కాళేశ్వరం కులేశ్వరం అయిందని పల్లెల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, నాయకులు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, ఓరగంతి తిరుపతి, మట్ట రమణారెడ్డి, కుక్కల దేవేందర్, పెంజర్ల బాలెల్లు, శీల ప్రశాంత్, మట్ట రాణి, మిరుదొడ్డి భాను, దీటి నర్సింలు, ఆగుళ్ల రాజేశం, తాళ్ల విజయ్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న కెకె మహేందర్‌రెడ్డి

గంభీరాబుపేటలో...

గంభీరావుపేట : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లో స్కాములే రాజ్యమేలాయని సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారం పోయిన బీఆర్ఎస్ నాయకుల్లో అహంకారం పోలేదన్నారు. తెలంగాణ ప్రజలు పదేళ్లు కొత్త రేషన్ కార్డులకు నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొద్ది మాసాలకే అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. రెండేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, పార్టీ నాయకులు రామచంద్రరెడ్డి ఉన్నారు.

నాడు ఎమ్మెల్యేకు.. నేడు సర్పంచ్ బరిలో...

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ నుంచి శాసన సభ ఎన్నికల వరకు ఆయన బరిలో నిలిచి తన రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా.. ఓసారి ఎమ్మెల్యేగా ఓటమి పాలైన నిరుత్సాహ పడకుండా ఈ సారి పంచాయతీ ఎన్నికల్లోనూ సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేశారు ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన ద్యాప దేవయ్య. 2008, 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. గత శాసనసభ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి పిరమిడ్ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి 282 ఓట్లు సాధించారు. మూడో విడత జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో రాజన్నపేట గ్రామం సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించడంతో తిరిగి దేవయ్య నామినేషన్ దాఖలు చేశారు. పోటీలో నిలిచి ఈ సారి విజయం కోసం ప్రయత్నం చేస్తున్నారు.

కాంగ్రెస్ సంక్షేమ పథకాలకు ఆదరణ

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు కేటాయించిన గుర్తులపై ఓటు వేసి గెలించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని సూచించారు. రుద్రవరం గ్రామంలోని ఏకగ్రీవమైన ఇద్దరు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలోకి రావడం అభినందనీయమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని, కాంగ్రెస్ సంక్షమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, గాలిపెల్లి స్వామి, కత్తి కనుకయ్య తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చందుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఈ సంర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ జలగం కిషన్ రావు, సీనియర్ పాత్రికేయులు హింగే శ్రీనివాస్, నాయకులు చిలుక పెంటయ్య, దప్పుల ఆశోక్, పరశురాములు, రమేష్ గౌడ్, రమేష్ రావు, ఇస్మాయిల్, దేవయ్య, రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్ తదితరులు ఉన్నారు.

ఉపసంహరణలపై దృష్టి

● ఊపందుకోనున్న మూడో విడత ప్రచారం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు, పరిశీలన ప్రక్రియ పూర్తితో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని పల్లెల్లో ప్రచారం ఊపందుకుంది. సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సమయం చిక్కితే చాలు యువజన, కుల, మహిళ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అంత కంటే ముందు నామి నేషన్ల ఉపసంహరణ ఈ నెల 9తో ముగియనుండగా.. బరిలో ఉన్న అభ్యర్థులను తప్పించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో 26 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ స్థానాలకు 142 మంది, 226 వార్డు స్థానాలకు 542 మంది, వీర్నపల్లిలో 17 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 87, 132 వార్డులకు 219 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రాగట్లపల్లి, గుంటపల్లిచెరువుతండా, జవహర్‌లాల్‌నాయక్ తండా గ్రామ సర్పంచ్, వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో అక్కడ ఏకగ్రీవం కానున్నాయి. మిగిలిన అన్ని గ్రామాల్లో పోటాపోటీ నెలకొంది. ఉపసంహరణకు మంగళవారం సమయం ఉండడం వల్ల పల్లెల్లో తెర వెనుక 'రాజీ'కీయం సాగుతోంది. అన్ని పంచాయతీల్లో 2 నుంచి 10 మంది వరకు బరిలో నిలిచే వారున్నారు. వారితో మంతనాలు సాగిస్తూ.. బాబ్బాబు.. ఉప సంహరించుకోవూ..! అంటూ బతిమిలాడుతున్నారు. పైకాన్ని ఆశ చూపుతున్నారు. రాక రాక వచ్చిన అవకాశం వదిలి పెట్టరూ అని ప్రాదేయ పడుతున్నారు. అయితే ఉప సంహరణ గడువు వరకు బెట్టు చేస్తే ఎంతో కొంత అందక పోదా..? అని ఎదురు చూసే వారు లేకపోలేరు. ఇలాంటి వారి వల్ల తమ ప్రయత్నాలు దెబ్బతింటాయని సీరియస్‌గా బరిలోకి దిగుతున్న వారు మదన పడుతున్నారు. ఈ క్రమంలో ఉప సంహరణ జేసుకునేలా శత విధాలు ప్రయత్నిస్తున్నారు. బుజ్జగింపులతో నచ్చజెప్పడమో.. బతిమిలాడటమో.. వేరే పదవులను ఎర వేయడమో.. లేకుంటే అడిగినంత ముట్టజెప్పడమో.. ఎలా వీలైతే అలా చేస్తున్నారు. మొత్తం మీద పల్లెల్లో తెర వెనుక రాజకీయాలు జోరుగా కొనసాగుతున్నాయి.